

తెహెల్కా

ప్రతి వార్త సంచలనం



హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 248 శుక్రవారం 9 అక్టోబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత..

హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్.
లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు
పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం
పాన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్



'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు.

- మిగతా 2లో

నాపై పోటీ చేసి గెలువు:

కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్



- ఖైరతాబాద్ బరిలో దిగాలని కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్
- ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం అని వ్యాఖ్య

దక్షిణ కొరియా సాయం మాకొద్దు.. అదొక అవమానమన్న కిమ్ సోదరి

దక్షిణ కొరియా మానవతా సాయాన్ని తిరస్కరించిన ఉత్తర కొరియా
ఇదొక అవమానం, రాజకీయ ప్రేరేపిత కవ్వింపు చర్య అని వ్యాఖ్య
ఉత్తర కొరియా అధినేత సోదరి కిమ్ యో జోంగ్ ప్రకటన



2

యుద్ధం తర్వాత చమురు ధరలు భారీగా తగ్గుతాయని అంచనా

- ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగుస్తుందని ట్రంప్ ప్రకటన
- ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టీకరణ
- యుద్ధంతో చమురు ధరలు పెరిగినా అంచనాల మేర పెరగలేదని వ్యాఖ్య
- ఇరాన్‌తో ఒప్పందం పై విట్‌కాఫ్ చర్చలు జరుపుతున్నారని వెల్లడి



2

ప్రభుత్వ చర్య పై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు



2

జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
రైతుల పై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

వికారాబాద్‌లో నకిలీ బంగారం కలకలం

జిల్లాలోని పరిగిలో నకిలీ బంగారం ముఠా మోసాలు కలకలం రేపుతున్నాయి. అమాయకులను మోసం చేస్తూ నకిలీ బంగారాన్ని అంటగడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి.ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు ముఠాను అదుపులోకి తీసుకుని నగదును రికవరీ చేసిన పోలీసులు.. వారిని వదిలేశారు. అయితే ఆ తరువాతి రోజు మరో బాధితుడు వెలుగులోకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.



2

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు



తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. - మిగతా 2లో

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్

సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్
ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు



2

హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత..

'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త వరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపు నిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్త మైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

ప్రభుత్వ చర్య పై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు

పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. రి'నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేసింది మీరు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా?. సాగునీరు లేక, కరెంట్ లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. వరిష్కరించాల్సింది పోయి.. కేసులు అక్రమ కేసులు పెడతారా?. ఇది ప్రజా పాలననా? లేక ప్రజా పీడననా?. రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం' అని హరీశ్ రావు పేర్కొన్నారు. 'ఇంజనీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. మీ చేతగానితనం వల్ల ఈరోజు పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న దుస్థితి. కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా?. ఇదెక్కడి దుర్మార్గం? ఇదెక్కడి అన్యాయం?. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది మీరు'.

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోదీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందో దేశ ప్రజలు గమనిస్తున్నారని.. ఇప్పటికైనా దేశ ప్రజలు మేల్కొవాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేష్ ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యథేచ్ఛగా ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నామన్నారు. బిహార్, వెస్ట్ బెంగాల్ తర్వాత తెలంగాణను బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేసిందని మహేశ్ అన్నారు.

వికారాబాద్‌లో నకిలీ బంగారం కలకలం

ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు ముఠాను అదుపులోకి తీసుకుని నగదును రికవరీ చేసిన పోలీసులు.. వారిని వదిలేశారు. అయితే ఆ తరువాతి రోజు మరో బాధితుడు వెలుగులోకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నకిలీ బంగారం ముఠా ఇంకా ఎంతమందిని మోసం చేశారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అమాయకులను ముంచేస్తున్న అంతరాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన నాగభూషణం, నాగరాజు, శివమ్మ, నాగలక్ష్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2 లక్షల నగదు, నకిలీ బంగారం బిస్కెట్లు, పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. తొండపల్లి ప్రాంతానికి చెందిన ఓ టైలర్‌కు అసలు బంగారం చూపించి నమ్మించిన నిందితులు.. రూ.3 లక్షలకు నకిలీ బంగారం అంటగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన పై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్.. వారి నుంచి నగదును రికవరీ చేశారు. అయితే నిందితులను వదిలేసిన మరుసటి రోజే మరో బాధితుడు వెలుగులోకి వచ్చాడు. ?పరిగికి చెందిన ఓ వ్యాపారికి రూ.7 లక్షల విలువైన బంగారం బిస్కెట్ ఇస్తామని నమ్మించిన కేటుగాళ్లు.. అతడి నుంచి రూ.3 లక్షలు తీసుకుని కంచు ముక్కను ఇచ్చినట్లు సమాచారం. అయితే మోసపోయి రెండు నెలలైనా పరువు పోతుందన్న భయంతో బాధితులు ఇన్నాళ్లుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది. నిందితులను వదిలేశాక మరో బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరువు పోతుందన్న ఆందోళనతో మీడియా ముందుకు రావడానికి మరి కొందరు బాధితులు విముఖత చూపుతున్నట్లు సమాచారం. దీంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ వచ్చే అపరిచితులను నమ్మి మోసపోవద్దని ప్రజలను పోలీసులు హెచ్చరించారు.

తెలంగాణలో మండుతున్న ఎండలు.. పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత



తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నాపై పోటీ చేసి గెలువు: కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

యుద్ధం తర్వాత చమురు ధరలు భారీగా తగ్గుతాయని అంచనా

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యుద్ధం ముగిసిన వెంటనే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేశారు. ఇరాన్ అణ్వాయుధం పొందకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రచార సభలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్ అణు ముప్పును ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యలను ఆయన సమర్థించుకున్నారు.

త్వరలోనే బయటకు..

అమెరికా సైనిక చర్యలు త్వరలో ముగిసే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలిచ్చారు. "మేం త్వరలోనే అక్కడి నుంచి బయటకు వస్తాం. ఆ తర్వాత చమురు ధరలు కిందకు పడిపోతాయి" అని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని అంగీకరించినా.. ఊహించినంతగా పెరగలేదని చెప్పారు. గత ప్రభుత్వాలు ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయని ట్రంప్ విమర్శించారు. చాలా ఏళ్ల క్రితమే ఈ సమస్యను పరిష్కరించాల్సిందని పేర్కొన్నారు.

అణ్వాయుధానికి నో..

ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని పొందనివ్వబోమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌తో ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. తన ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఈ వ్యవహారంలో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. అయితే యుద్ధం ముగియాలనే తొందరలో ఏదో ఒక ఒప్పందాన్ని అంగీకరించేందుకు తాను సిద్ధంగా లేనని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ సంక్షోభం వల్ల ఇంధన ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం అధికంగా కనిపిస్తోందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. యుద్ధం ముగిశాక ఇంధన సరఫరాలు మెరుగుపడతాయని, ద్రవ్యోల్బణం తగ్గడంతో పాటు రుణ వడ్డీ రేట్లు కూడా దిగివచ్చే అవకాశం ఉందని చెప్పారు.

దక్షిణ కొరియా సాయం మాకొద్దు.. అదొక అవమానమన్న కిమ్ సోదరి

దక్షిణ కొరియా ఇస్తామన్న మానవతా సాయాన్ని ఉత్తర కొరియా తిరస్కరించింది. ఇది తమ దేశానికి జరిగిన అవమానమని, రాజకీయ ప్రేరేపిత కవ్వింపు చర్య అని ఘాటుగా విమర్శించింది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా భావించే కిమ్ యో జోంగ్ ఈ మేరకు అధికారిక మీడియా సంస్థ 'కేసీఎన్ఏ' ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. మానవతా కార్యక్రమంలో భాగంగా ప్యాంగ్యాంగ్‌లోని ఒక ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను పంపాలని దక్షిణ కొరియా ప్రణాళిక సిద్ధం చేసింది. వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సలు, ఇతర చికిత్సలకు అవసరమైన 166 కేటగిరీలకు చెందిన 1,431 వైద్య వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేసింది. దీనికోసం మే నెలలోనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నుంచి ఆంక్షల మినహాయింపును కూడా పొందింది. అయితే, ఈ సాయాన్ని కిమ్ యో జోంగ్ 'ఒక ప్రహసనం'గా కొట్టిపారేశారు. "ఇది మా దేశానికి అవమానం. మా జాతీయ చట్టాలను ఉల్లంఘించేలా రాజకీయంగా ప్రేరేపించిన కవ్వింపు చర్య. ఈ చర్య అత్యంత వికారమైనది" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో, సెప్టెంబర్ 21న జరిగిన మైన్ పేలుడు ఘటనలో ముగ్గురు దక్షిణ కొరియా సైనికులు గాయపడటానికి ఉత్తర కొరియానే కారణమని సియోల్ తేల్చడాన్ని కూడా ఆమె విమర్శించారు. "మైన్ పేలుడు అనే నాటకం ఫ్లాప్ అవ్వడంతో, ఇప్పుడు వైద్య పరికరాల సహాయం అనే మరో నాటకానికి తెరలేపారు" అని ఎద్దేవా చేశారు. దక్షిణ కొరియాతో చర్చలు జరిపే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు. "రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)తో మేం ఇచ్చిపుచ్చుకునేది ఏమీ లేదు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో ఈ సాయాన్ని ఉత్తర కొరియా స్వీకరిస్తుందా అనే అనుమానాలు ముందు నుంచే ఉన్నాయి.

సంపాదకీయం

ఆయిల్‌పామ్... సుంకం తగ్గింపు దేనికి సంకేతం?



దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించాలి, దేశీయ ఉత్పత్తిని పెంచాలి, రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు ప్రోత్సహించాలి, వంటనూనెల విషయంలో దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించాలి'-- ఇదీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్--ఆయిల్‌పామ్' ద్వారా దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ విస్తరణను ప్రోత్సహిస్తోంది. కేంద్రం ఇచ్చిన ఈ విధాన సంకేతాన్ని నమ్మి తెలంగాణ వంటి రాష్ట్రాలు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు శ్రీకారం చుట్టాయి. ఒకవైపు దేశీయ ఆయిల్‌పామ్ సాగును పెంచాలని చెబుతూ, మరోవైపు విదేశాల నుంచి వచ్చే క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాలను వరుసగా తగ్గించడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. 2024లో దేశీయ నూనెగింజల రైతులను చౌక దిగుమతుల నుంచి రక్షించేందుకు క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై ఎఫెక్టివ్ ఇంపోర్ట్ డ్యూటీని 27.5 శాతానికి పెంచిన కేంద్రం, ఆ తర్వాత దానిని 16.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు మరోసారి దిగుమతి సుంకాన్ని తగ్గించే నిర్ణయం తీసుకుంది.వినియోగదారులకు అందుబాటు ధరల్లో వంటనూనెలు అందించాలనే లక్ష్యం అవసరమైనదే. కానీ ఆ ఉపశమనం కోసం దేశీయ రైతు ఆదాయం, అతని దీర్ఘకాలిక పెట్టుబడి, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయిల్‌పామ్ విస్తరణ భవిష్యత్తు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కూడా అంతే అవసరం.ఆయిల్‌పామ్ విస్తరణ కేవలం ఢిల్లీలో ఒక ప్రకటనతో జరగదు. క్షేత్రస్థాయిలో రైతును ఒప్పించాలి, సంప్రదాయ పంటల నుంచి దీర్ఘకాలిక ఆయిల్‌పామ్ సాగువైపు మళ్లించాలి, మొక్కలను అందుబాటులోకి తేవాలి, సాగునీరు, డ్రిప్, తోటల నిర్వహణకు సహకరించాలి, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించాలి, కంపెనీలు--రైతుల మధ్య సమన్వయం చేయాలి. ఈ మొత్తం బాధ్యతను ప్రత్యక్షంగా నిర్వహించేది రాష్ట్ర ప్రభుత్వాలే. తెలంగాణ ప్రభుత్వం కూడా రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయిల్‌పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 3.2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించింది. ఇక్కడే అసలు వైరుధ్యం కనిపిస్తోంది. రైతును ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకువచ్చే బాధ్యత రాష్ట్రానిది. కానీ అదే రైతు పంట ధరను ప్రభావితం చేయగల దిగుమతి సుంకం నిర్ణయం మాత్రం కేంద్రం చేతిలో ఉంది.దిగుమతి సుంకాల తగ్గింపుతో చౌకైన విదేశీ పామాయిల్ దేశీయ మార్కెట్‌లోకి వచ్చి రైతు ఆదాయంపై ఒత్తిడి ఏర్పడితే, రైతు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించడు. తనకు అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్నే అడుగుతాడు. స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీస్తాడు. విధానం కేంద్రానిది, కానీ రైతు ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సింది రాష్ట్రం. ఈ పరిస్థితిని కేంద్రం విస్మరించకూడదు. ఇది కేంద్రం--రాష్ట్రం మధ్య రాజకీయ వివాదంగా చూడాల్సిన అంశం కాదు; సమాఖ్య వ్యవస్థలో వ్యవసాయ విధాన నిర్ణయాలు ఎలా ఉండాలన్న మౌలిక ప్రశ్న. ఆయిల్‌పామ్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్రాలతో సంప్రదించకుండా దిగుమతి విధానంలో తరచూ మార్పులు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన భరోసాను ఎలా నిలబెట్టుకోగలుగుతాయి? ఆయిల్‌పామ్‌ను ఇతర పంటలతో పోల్చలేం. వేరుశెనగ, సోయాబీన్ వంటి పంటలు ఒక సీజన్‌లో గిట్టుబాటు కాకపోతే రైతు తర్వాతి సీజన్‌లో మరో పంటకు మారవచ్చు. ఆయిల్‌పామ్ రైతుకు ఆ అవకాశం లేదు. మొక్క నాటిన తర్వాత వాణిజ్య స్థాయిలో ఆదాయం రావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. నీటి వసతి, డ్రిప్, ఎరువులు, నిర్వహణపై నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఒకసారి తోట ఏర్పాటు చేసిన రైతు దాదాపు మూడు దశాబ్దాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఆ పంటతో ముడిపడి ఉంటాడు. అంటే రైతు నాటింది కేవలం ఆయిల్‌పామ్ మొక్క కాదు; ప్రభుత్వ విధానంపై తన నమ్మకాన్ని. "విదేశీ పామాయిల్‌ను మరింత చౌకగా తీసుకొస్తే... నా పెట్టుబడికి, నా భవిష్యత్తుకు భరోసా ఎవరు?" అని రైతు అడిగితే దానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దిగుమతి సుంకం తగ్గినంత శాతంలోనే రైతుకు లభించే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్ఎఫ్‌బీ) ధర తగ్గుతుందని చెప్పలేం. అంతర్జాతీయ క్రూడ్ పామాయిల్ (సీపీఓ) ధరలు, మారకపు విలువ, రవాణా వ్యయం, ప్రాసెసింగ్ మార్జిన్లు, ఎఫ్ఎఫ్‌బీ ధర నిర్ణయ విధానం వంటి అనేక అంశాలు తుది ధరను ప్రభావితం చేస్తాయి. కానీ చౌక దిగుమతులు దేశీయ ఉత్పత్తిపై ధరల ఒత్తిడిని పెంచే అవకాశాన్ని విస్మరించలేం. అందుకే నాడు రైతు రక్షణ కోసం అవసరమని భావించిన దిగుమతి రక్షణను నేడు వరుసగా ఎందుకు తగ్గించాల్సి వస్తోంది? అన్నది ప్రశ్న. వినియోగదారుడి ప్రయోజనం ముఖ్యమే, పరిశ్రమ ప్రయోజనం కూడా అవసరమే; కానీ వీటి మధ్య రైతు ప్రయోజనం బలికాకూడదు. ఇప్పటికే ఆయిల్‌పామ్ వేసిన రైతుకు భవిష్యత్ ఆదాయంపై అనిశ్చితి ఏర్పడితే కొత్త రైతులు ఈ పంట వైపు రావడానికి వెనుకాడతారు. తోటల నిర్వహణపై పెట్టుబడులు తగ్గవచ్చు, ప్రాసెసింగ్ సామర్థ్యంపైనా ప్రభావం పడవచ్చు. చివరకు వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలన్న జాతీయ లక్ష్యానికే ప్రతికూల పరిస్థితి ఏర్పడవచ్చు.

బహుజన యోధుడు కాన్షీరామ్

-సామాజిక అంతరాలు , దోపిడీ , మనువాద రాజకీయాలను అంతమొందించడానికి జీవితాంతం పోరాడిన యోధుడు...అభినవ బుద్ధుడు కాన్షీరామ్.

-ఉన్నతమైన ఆశయం కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని , కుటుంబాన్ని, విలాసవంతమైన జీవితాన్ని త్యజించారు. గౌతమ బుద్ధుని లాగానే బహుజన నాయకుడు

-కాన్షీరామ్ ది కూడా మహోన్నతమైన చరిత్ర. సాంప్రదాయ రాజకీయాల్లో మనువాద భావజాలం , కుటిల రాజకీయాల మెదలు వంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల్ని... ఆశయాలను కాన్షీరామ్ ఆచరణలో చూపించారు.

పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లాలో ఖావాజ్ ఫూర్ గ్రామంలో మార్చి 15, 1934లో హరిసింగ్, బిషన్ సింగ్ కౌర్ దంపతులకు జన్మించిన మొదటి మగబిడ్డ కాన్షీరామ్. చిన్నతనం నుంచే కాన్షీరామ్ ది సంప్రదాయ వ్యతిరేక వైఖరి. సిక్కు సంప్రదాయాల ప్రకారం.. పెంచాల్సిన జుట్టును కత్తిరించుకున్నారు. తన రోజు వారీ ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడకుండా చిన్న చిన్న పనులు చేసి సంపాదించుకునేవారు. రోపార్ లో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన కాన్షీరామ్ కు డెహ్రాడూన్ లోని భారతీయ సర్వే విభాగంలో ట్రైనీ అధికారిగా ఉద్యోగం వచ్చింది. అదే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్నుమూశారు. దేశంలో దళిత ఉద్యోగులంతా తమ ఇంటి పెద్దను కోల్పోయినట్టు దుఖ సాగరంలో మునిగిపొవడం చూసి కాన్షీరామ్ చలించిపోయారు. అంబేడ్కర్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. అదే విభాగంలోని సహ ఉద్యోగి శ్రీగైనీ ద్వారా బాబాసాహెబ్ అంబేడ్కర్ గురించి లోతైన విషయాలను మొట మొదటి సారిగా తెలుసుకున్నారు. అదే సమయంలో రక్షణ పరిశోధనా శాఖలో పోటీ పరీక్షలు రాసి పూనాలోని డిఫెన్సు లేబరేటరీలో సైంటిఫిక్ అధికారిగా చేరాడు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రకటించినట్టే 1963లో కూడా వార్షిక క్యాలండర్ ను ప్రచురించింది. (ఆ సంప్రదాయం ఇప్పుడు కూడా ఉంది.) అయితే,గతం నుంచి అమలులో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ జయతి, బుద్ధ జయంతి ప్రస్తావన లేకుండానే క్యాలెండర్ ను కేంద్ర ప్రభుత్వం ప్రచురించింది. వాటికి బదులుగా బాలగంగాధర్ తిలక్ జయంతి, దీపావళికి అదనంగా ఒక రోజు కలిపి సెలవులు ప్రకటించారు. క్యాలెండర్ విషయంలో అధికారుల వివక్షపూరిత చర్య పట్ల షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఉద్యోగులు, అధికారులు ఎంతో బాధ పడ్డారు. కానీ, ఎవరూ కూడా బయటపడి ఎదురించలేదు, మాట్లాడలేదు. నాల్గవ తరగతి ఉద్యోగి అయిన 'దీనా బానా' బహిరంగంగా వ్యతిరేకించాడు. దీంతో అధికారులు అతన్ని ఉద్యోగం నుంచి భర్తరఫ్ చేశారు. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన కాన్షీరామ్ జీర్ణించుకోలేకపొయాడు.

దీనాబానాకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచి..కేంద్రంపై పోరాడి తిగిరి అతని ఉద్యోగాన్ని సాధించాడు. అంబేడ్కర్, బుద్ధ జయంతి సెలవులను మళ్ళీ అధికారికంగా అమలుచేయించటంలో కాన్షీరామ్ సఫలీకృతులయ్యారు.

అంబేడ్కర్ ఆలోచన విధానంపై ఇంకా లోతుగా అధ్యయనం చేస్తున్న సమయంలో కాన్షీరామ్

-మరో ఉద్యమం ఎత్తుకోవాల్సి వచ్చింది.

చేసింది. అన్ని అర్హతలు ఉన్నా... ఓ దళిత మహిళను ఉద్యోగంలో చేర్చుకోకుండా వివక్ష పూరితంగా వేధిస్తున్న అధికారుల తీరుపై తిరుగుబాటు జెండా ఎగుర వేశాడు. ఈ క్రమంలోనే సహనం కోల్పోయి సంబంధిత అధికారిపై కాన్షీరామ్ చేయిచేసుకున్నాడు. ఈ రెండు సంఘటనలు కాన్షీరామ్ జీవితాన్ని మలుపు తిప్పాయి. సాంఘీక అసమానతలకు వ్యతిరేకంగా సమానత్వ రాజ్యస్థాపనకు పూలే, అంబేడ్కర్ కన్న కలల్ని సాకారం చేయడం కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో రంగంలోకి దిగాడు కాన్షీరామ్. సమాజంలోని 15శాతం అగ్రకులాలు, 85 శాతంగా ఉన్న బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాడు. బహుజనుల బతుకులను మార్చాలంటే దీర్ఘకాలిక ఉద్యమం అవసరం అని నిర్ధారించుకున్న కాన్షీరామ్.. తల్లిదండ్రులకు సుదీర్ఘరమైన ఉత్తరం రాసి తాను బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచన విధానం.... ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించుకొని ఇకమీదట ఇల్లు, కుటుంబం వదిలేస్తున్నాననీ ప్రకటించారు. ఆ నిర్ణయం మీద కఠినంగా నిలబడిన కాన్షీరామ్ 1983 లో తండ్రి మరణించినా అంత్యక్రియలకు ఇంటి వైపు వెళ్లలేదు. 1964లో ఉన్నత ఉద్యోగాన్ని వదిలేసిన కాన్షీరామ్.. మిత్రులు మనోహర్ అటే, డికే ఖపార్డే, శ్రీగైనీ, తంబాఖే, మధపరిహార్, భీమ్రావు దళాళ్ వంటి వారితో కలిసి పూనా

-కేంద్రంగా మహారాష్ట్ర అంతటా పర్యటించారు.

సామాజిక రుగ్మతలను ఎత్తిచూపుతూ ఉద్యోగులను ఏకం చేసేందుకు కృషిచేశారు. 1965 నుంచి 1971 వరకు రిపబ్లికన్ పార్టీ పునర్నిర్మాణం కోసం నిర్విరామంగా కృషి చేశారు. బామ్ సెఫ్ ఉద్యమాన్ని విస్తరించటంలో భాగంగా 1979లో ఢిల్లీలో అంబేడ్కరిజం - మనుగడ అనే అంశం మీద సెమినార్లు నిర్వహించి చర్చలేవనెత్తారు. 1980లో అంబేడ్కర్ మేళా రథయాత్ర ద్వారా దాదాపు 9 రాష్ట్రాల్లో 34 పట్టణాల్లో విస్తృతంగా బౌద్ధ సిద్ధాంత ప్రచారం చేశాడు. 1982లో పరిమిత రాజకీయ కార్యచరణలో భాగంగా హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో డీఎస్-4 ద్వారా ఏకంగా 42మంది అభ్యర్థులను బరిలో దించారు. మొత్తం పోలైన ఓట్లలో 1.19శాతం ఓట్లను సాధించి డీఎస్-4 అభ్యర్థులు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ (ఎస్) వంటి జాతీయ పార్టీల కన్నా ఎక్కువ ఓట్లు సాధించి తమ ఉనికి చాటుకున్నారు.

హర్యానా ఎన్నికల తర్వాత.. మన ఓటు మనకే వేసుకోవాలనీ, మన టికెట్ మనమే ఇచ్చుకోవాలని వచ్చిన చైతన్య స్పూహను ఆచరణ రూపంలోకి మార్చాలని కాన్షీరాం నిర్ణయించారు. రాజకీయ పార్టీ ఆవశ్యకతను గుర్తించిన కాన్షీరామ్... బామ్సెఫ్, డీఎస్-4 కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాలు, అభిమానుల సమక్షంలో 1984 ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున 'బహుజన్ సమాజ్ పార్టీ'ని ఏర్పాటు చేశారు. బహుజన సమాజ్ పార్టీ రూపొందించిన నినాదాలు అగ్రకుల పాలక వర్గాల పార్టీల్లో భయాన్ని.. బహుజన సమాజ్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపాయి.' సంసద్ ఛలో అప్నేపైరోంపర్ ఛలో' (పార్లమెంటుకునడు. నీకాళ్ల మీద నువ్వునడు). ఓటు హమారా, రాజ్ తుమారా, నహీచలేగా, నహిచలేగా (ఓట్లు మావి, సీట్లు మీవా-ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు) 'బాబా తేరా మిషన్ అధూరా కాన్షీరామ్ కరేగాపూరా ' (బాబా నీవు వదిలి వెళ్లిన కర్తవ్య స్ఫూర్తి కాన్షీరామ్ చేస్తాడు పూర్తి) జో జమీన్ సర్కారీహై ఓ జమీన్ హమారీ హై (ఏ భూమి ప్రభుత్వందో ఆభూమి మనదే) వంటి చైతన్య పూరిత నినాదాలు... అక్షరం తెలియని బహుజన సమాజంలో పదునైన ఆయుధాలుగా నిలిచిహ సృష్టింపజేశాడు. ఎవరెంత మందో వారి కంత వాటా అన్న సిద్ధాంతాన్ని ఆచరణాత్మకంగా ... ప్రయోగాత్మకంగా నిరూపించిన వ్యక్తి కాన్షీరామ్. బహుజన రాజ్యాన్ని భారత దేశం మొత్తం సాకారం చేయడం కోసం తన ఆఖరి క్షణం వరకు పరితపించిన గోప్పయోధుడు కాన్షీరామ్. అర్ధాంత రంగా అనారోగ్యానికి గురైన ఆయన... లక్నోలో 2003 ఆగస్టు 25న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో

-కార్యకర్తల సహకారంతో వేదికపైకి వచ్చి

చివరిగా మాట్లాడారు. "మనువాద వ్యవస్థను మార్చి.. సమకాలీన భారత దేశంలో బహుజనుల ఆత్మగౌవరం, సమానత్వం... సమధర్మం కోసం మహాత్మాజ్యోతిభా పూలే, సాహుమహరాజ్, పెరియార్, నారాయణగురు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిరంతరం కృషి చేసినా, వారి జీవితం సరిపోలేదన్నారు. సమాజాన్ని మార్చటానికి నా జీవిత కాలమంతా మీ ముందు ఉండి కృషి చేశాను...నా జీవితమూ సరిపోలేదు.

కానీ మీ అందరిని తయారు చేశాను, మీరే ఈ ఉద్యమవారసులు, మీ మీదే ఈ బాధ్యత ఉంచుతున్నాను... ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదిరించి ముందుకే వెళ్లండి" అంటూ సందేశం ఇచ్చారు కాన్షీరామ్. రెండున్నర సంవత్సరాల పాటు వైద్యనిపుణుల పర్యవేక్షణలో చికిత్సపొందుతూ కోమాలేనే గడిపారు. బహుజన సమాజం కోల్పోయిన హక్కులను

సాధించడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత మనవాతా మూర్తి కాన్షీరామ్ . 2006 అక్టోబర్ 9 రాత్రి పొద్దుపోయాక కాన్షీరామ్ కన్నుమూశారు.

బట్టిపాటి రాజశేఖర్
సీనియర్ జర్నలిస్ట్
వైస్ ప్రెసిడెంట్
టి డబ్ల్యూ జె ఎఫ్
9849777354



పోగొట్టుకున్న 67 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన జనగామ పోలీస్



-డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఐపీఎస్

(జనగామ అక్టోబర్ 8 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

జనగామ జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో పోగొట్టుకున్న మొబైల్ ను భాధితులు సెయిర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి అని రాజమహేంద్ర నాయక్ అన్నారు. ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఐపీఎస్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ధైర్యాన్ని కోల్పోకుండా సెయిర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా లేదా గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా తీసుకెళ్లినా, వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సెయిర్ (సెంట్రల్ ఈక్వయిప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి, పోగొట్టుకున్న ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చని తెలిపారు. పోగొట్టుకున్న వ్యక్తులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేనిపక్షంలో, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక పోలీసు అధికారిని సెయిర్ పోర్టల్ బాధ్యతాధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించినప్పుడు, బాధ్యతాధికారి సెయిర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తారని, తద్వారా కోల్పోయిన మొబైల్ ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా సెకండ్‌హ్యాండ్ ఫోన్లు అమ్మకానికి పెట్టినప్పుడు వాటిని కొనుగోలు చేయవద్దని సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో కృషి చేసిన ప్రతి పోలీస్ స్టేషన్ సిబ్బందిని డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఐపీఎస్ అభినందించారు. సెయిర్ పోర్టల్ ద్వారా స్వాధీనం మొత్తం : 67 మొబైల్ ఫోన్లు సెయిర్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధానం ముందుగా పోగొట్టుకున్న ఫోన్‌లో ఉపయోగించిన సిం ను తిరిగి యాక్టివేట్ చేసుకోవాలి. మీ సేవా కేంద్రం / పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఆర్టికల్స్ కింద చలానా కట్టాలి. తర్వాత సెయిర్ పోర్టల్‌ను ఓపెన్ చేసి, మీ మొబైల్ ఇమెయి నంబర్లను నమోదు చేసి, సూచించిన విధంగా దరఖాస్తును పూర్తి చేయాలి. అని తెలిపారు. సెయిర్ పోర్టల్ https://www.ceir.gov.in/ ఈ కార్యక్రమంలో జనగామ సిఐ సత్యనారాయణ రెడ్డి సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

23వ వార్డులో బతుకమ్మ ఏర్పా ట్లు చేయాలి

-లైటింగ్,పారిశుధ్యం మైక్ సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయాలి

-కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్.

తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

తెలంగాణ సంస్కృతి,సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగను 23వ వార్డులో మహిళలు ఉత్సాహంగా నిర్వ హించుకునేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ కోరారు.ఈ మేరకు పురపాలక సంఘం కమి షనర్‌కువినతిపత్రం అంద జేశారు. ఈ నెల 10న ఎంగిలిపూల బతు కమ్మతో ప్రారంభమయ్యే పండుగ సందర్భంగా వార్డులోని అరుం ధతి యూత్ అసోసియేషన్ వద్ద కామునికాంత,పోతలింగన్న బొడ్రాయి, మమ్మాయమ్మ గుడి,తోట నారాయణ ఇంటి వద్ద బతుక మ్మ వేడుకలకు అవసరమైన ఏ ర్పాట్లు చేయాలని కోరా రు. అలాగే బొల్లేపల్లి ఎల్లమ్మ ఇంటి నుంచి మెయి న్‌రోడ్డు బోరింగ్ చింతచెట్టు వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య కూడళ్లలో ప్రత్యేక లైటిం గ్‌తోపాటు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతా ల్లో మైక్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కోరారు. పండుగ రోజుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నం దున ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ముందస్తు చర్యలు



చేపట్టాలని ఆమె సూచి ంచారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌర వానికి ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగను ఘనంగా నిర్వ హించుకునేలా మున్సిపల్ యం త్రాంగం సహకరి ంచాలని పూజి త జహంగీర్ కోరారు.

ఘనంగా గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 8

శేర్లింగంపల్లి బిజెపి సీనియర్ నాయకులు గజ్జల యోగానంద జన్మదిన వేడుకలు శుక్రవారం కొండాపూర్ లో రెడ్సన్ హోటల్లో ఎర్రదొడ్డి భాస్కర్ రెడ్డి రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి శాలువాతో సత్క రించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్య కర్తలు మధ్య జన్మదినకి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా యోగానంద మాట్లాడుతూ బిజెపి కార్య కర్తలు మధ్య చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాస్ , శ్రీనివాసరెడ్డి, పలువురు సీనియర్



కార్యకర్తలు, అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో "భారత ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే

(జనగామ అక్టోబర్ 8 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

ఏఐసీసీ పిలుపు మేరకు 08 అక్టోబర్ 2026న "భారత ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే"గా పాటిస్తూ, జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు అనంతరం బీజేపీ ప్రభుత్వం, జ్ఞానేష్ కుమార్, మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, బీజేపీ "ఓట్ చోరీ"పై పోరాటం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ వాద్రా , సీనియర్ నాయకులు మరియు ఇండియా కూటమి ఎంపీలపై దౌర్జన్యంగా వ్యవహరించడం, లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఓటర్ల హక్కులను కాపాడేందుకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ



నారాయణ నాయక్ మాట్లాడుతూ, "జనగామ జిల్లాలోనే 63 వేలకుపైగా ఓట్లకు నోటీసులు జారీ చేశారంటే, ఆ ఓటర్లు జనగామ జిల్లాకు చెందిన వారు కాదా? వారందరికీ ఎందుకు నోటీసులు జారీ చేశారు?" అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఇలాంటి అంశాలపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నోటీసులు జారీ చేసిన కారణాలను స్పష్టంగా తెలియజేసి, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ కోరారు.

ఓటు చోరీ ఆరోపణలపై పోరా టం చేస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీలపై పోలీసుల చర్యలకు నిరసనగా బ్లాక్ డే-పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

తెహెల్కా న్యూస్ భువనగిరి 8-10-2026

ఓటర్ల జాబితా సవరణ,ఎన్నికల ప్రక్రియలో పారద ర్శకత తదితర అంశాలపై కాంగ్రెస్ పార్టీ, INDIA కూటమి నేతలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ప్రతి పక్ష ఎంపీలను పోలీసులు అదు పులోకి తీసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు నిరసనగా,ఏఐసీసీ పిలుపుమేరకు అక్టోబర్ 8వ తేదీ ని బ్లాక్ డేగా పాటిస్తూ దేశవ్యా ప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని డాక్టర్ బాబాసాహె బ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఎన్నికల ప్రక్రి యలో పారదర్శకత,ఓటర్ల హక్కుల పరిరక్షణ, ప్రజా స్వామ్య విలువల ను కాపాడాల్సిన బాధ్యత అంద రిపై ఉందన్నారు.ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ప్రతిప క్షాలు లేవనెత్తుతున్న 'ఓట్ చోరీ' ఆరోపణలపై స్పష్టమైన సమాధా నం ఇవ్వాలని,ఎన్నికల వ్యవస్థ పై ప్రజల్లో నెలకొన్న అనుమానా లను నివృత్తి చేయాలని డిమాం డ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించేహక్కు నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరు డికి రాజ్యాంగం కల్పించిందని, ప్రతిపక్ష నాయకులపై పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఎన్నికల వ్యవస్థ పై



ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉం డాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటర్ల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ చే స్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయ కులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,యువజన నాయకు లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివేకానంద నగర్ మెయిన్ రోడ్ నుండి సర్వీస్ రోడ్లో పర్యటించిన అరికెపూడి గాంధీ

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ అక్టోబర్ 8

శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పి ఏ సి చైర్మన్ వివేకానంద నగర్ మెయిన్ రోడ్ నుండి సర్వీస్ రోడ్లో పర్యటించి ప్రజల సౌకర్యం కొరకు ఆర్టీసీ బస్సులు గురించి బస్ స్టాప్ గురించి రోడ్ ఎక్టెన్షన్ చేసి ఆర్టీసీ బస్సులు ఆగే విధంగా ఏర్పాటు చేయడం జరుగు తుందని ఎమ్మెల్యే తెలిపార, అదేవిధంగా ప్రజల కొరకు రాజీ లేకుండా సమస్యలు పరిష్కరిస్తూ ప్రగతి పథకంలో ముందుకు దూసుకెళ్తున్న ఎమ్మెల్యే గాంధీ కి అధ్యక్షులు పురేందర్ రెడ్డి ప్రత్యేక అభినం దనలు తెలిపారు వివేకానంద నగర్ కాలనీ ఎంట్రన్స్ లో బస్సులు ఆటోలు స్టాప్ లేకుండా ముందుకు ఏర్పా టు చేయడము జరుగుతుందని తెలిపారు ఇలా చేయ డం వలన వివేకానంద నగర్ మెయిన్ ఎంట్రెన్స్ దగ్గర రోడ్డుపై ట్రాఫిక్ అంత రాయం ఏర్పడకుండా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్

అసోసియేషన్ అధ్య క్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి కమిటీ సభ్యులు జి నర్సింగ్ రావు లక్ష్మీనారాయణ సూర్యనారాయణ జి ప్రసాద్ సి కె రెడ్డి కెవి రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ కార్యవర్గాన్ని ప్రక టించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

భువనగిరి డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి ఇటీ వలనే ఎంపిక కాగా,గురువారం ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పూర్తిస్థాయి కమిటీని ప్రక టించారు.కాగా కమిటీలో చైర్మన్ తో 29 మందిడైరెక్టర్లకు సంబం ధించి వివరాలను చైర్మన్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చుక్కస్వామి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య యాదవ్,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్,మైనా ర్టీ సెల్ నాయకులు షానూర్ బాబా, మండల నాయకులు శేట్టి యాదగిరి, మన్నె వారు పంపు గ్రా మశాఖ అధ్యక్షుడు రాంబాబు గుంతకండ్ల సురేష్ పాల్గొన్నారు.

గూడూరు గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం



తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

గూడూరు గ్రామంలో పోషణ మాస కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ మాట్లా డుతూ. గర్భిణీలు, బాలికలు, బా లింతలు,కిషోర బాలికలు,చిన్నా రులు అందరూ కూడా బలమైన పౌష్టిక ఆహారాన్ని తీసుకొని పౌష్టి కాహార లోపాన్ని తగ్గిం చాలి. అంగన్వాడి కేంద్రాలలో అందించే సేవలు అందరు కూడా సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు ఈ సందర్భంగాICDS సూపర్వై జర్ మాట్లాడుతూ.. మంచి పోష కాహారం ద్వారా ఆరోగ్యాన్ని కా పాడు కోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాన సత్యనారా యణ,వార్డు స భ్యులు దొనకొండ శ్రీరాములు, పల్లె వెలుగు డాక్టర్ మనీషా, అంగన్వాడీ టీచర్స్ లోకదాసు రాధిక,ముష్కె శ్యామల,రాజేశ్వ రి,మహిళా సంఘ ప్రతినిధులు, ఆయాలు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తల్లులు తదితరులుపాల్గొన్నారు.

సేవ్ డెమోక్రసీ నినాదంతో నిర్వ హించిన చలో లోక్ భవన్ కార్య క్రమంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చే యాలని డిమాండ్ చేస్తూ ఇండి యా కూటమి ఇచ్చిన పిలుపుతో ఈరోజు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి లోక్ భవ న్ వరకు నిర్వహి ంచిన నిరసన ర్యాలీలో డిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు,ఎంపీలు సహ చర ఎమ్మెల్యేలతోకలిసి పాల్గొన్న భువనగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణా లో బతుకమ్మ పండుగ కానుక., మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ!



(హైదరాబాద్ అక్టోబర్ 8 తెహెల్కా న్యూస్ ప్రతినిధి సాగర్)

తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల మంది మహిళలకు 'ఇందిరా మహిళా శక్తి' చీరలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. సిరిసిల్లతో పాటు పలు ప్రాంతాల్లో నేతన్నలు ఈ చీరల తయారీని వేగంగా పూర్తి చేస్తున్నారు. ఈసారి ఈ చీరలు ఆకర్షణీయమైన చిలుక పచ్చ రంగులో అందరికీ అందుబాటులోకి రానున్నాయి.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'చలో లోక్ భవన్'

-కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి-పట్వారీ శశిధర్

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ

అక్టోబర్ 8

ప్రజాస్వామ్య విలువలను, ఓటు హక్కును పరిరక్షిం చాలనే డిమాండ్‌తో నెక్లెస్ రోడ్ వద్ద నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో "తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్" మెట్టు సాయి కుమార్ తో కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, సార్ ప్రక్రియలో అవకతవకలను నిరసనగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేయండి జరిగింది.ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని, వారి ఓటు హక్కును ఎట్టి పరిస్థి తుల్లోనూ బలహీనపరచకూడదని స్పష్టం చేశారు. "ఓటు హక్కు రక్షణే ప్రజాస్వామ్య రక్షణ.. ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది" అనే నినాదంతో నాయకులు, కార్యకర్తలు కార్యక్ర మంలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పట్వారీ శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, యువకులు, కార్యకర్తలు మరియు టీం పట్వారీ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




బంగారం ధరలు


manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

24 kt	₹	1,49,560	10gms
22 kt	₹	1,37,100	10gms
SILVER	₹	2,26,900	1kg

Contact: 6309 111299 | 99120 10888

మొగిళ్ల రాజిరెడ్డికి మద్దతుగా మియాపూర్-1 డిపో కార్మికులు

-టిడబ్ల్యూయూ అధ్యక్షుడిగా గెలిపించాలని పిలుపు

హైదరాబాద్ తెహెల్కా న్యూస్ :

తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడ బ్ల్యూయూ) అధ్యక్షుడిగా మొగిళ్ల రాజిరెడ్డిని గెలిపిం చాలని కోరుతూ మియాపూర్-1 డిపో కార్మికులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మియా పూర్-1 డిపోలో కార్మికుల ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించి, రాబోయే యూనియన్ ఎన్నికల్లో మొగిళ్ల రాజిరెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడే నాయకత్వం అవసరమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, అందుకు మొగిళ్ల రాజిరెడ్డి నాయకత్వం ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఈమని , యాద



య్య, మియాపూర్-1 డిపో అధ్యక్షుడు దామకుంట్ల బాల్‌రెడ్డి, కార్యదర్శి ఎన్. శంకర్‌రావు, వినాయక రెడ్డి చైర్మన్ ప్రశాంత్, సి. పాండు, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, మోహన్, ఎస్. యాదిరెడ్డి, టీవీఎస్ఎన్ రాజు, రమేష్, కేసిఎస్ రెడ్డి, అంజ నేయులు తదితరులు పాల్గొ న్నారు. మియాపూర్-1 డిపోకు చెందిన పలువురు కార్మికులు కూడా కార్యక్ర మంలో పాల్గొని మొగిళ్ల రాజిరెడ్డికి మద్దతు తెలిపారు. టిడబ్ల్యూయూ (మొగిళ్ల రాజిరెడ్డి) కు అశ్వత్థామరెడ్డి మరియు బికేయు(కొమురెల్లి రాజిరెడ్డి)మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ టిడబ్ల్యూ యూకు మద్దతు ప్రకటిం చినట్లు తాజా ప్రచార సభల్లో వెల్లడైంది. ఆర్టీసీ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం యూనియన్ మరింత బలంగా పనిచేయాలని నాయ కులు ఆకాం క్షించారు. కార్మికుల ఐక్యతతో టిడబ్ల్యూయూను బలో పేతం చేసి, మొగిళ్ల రాజిరెడ్డికి మద్దతుగా నిలవాలని మియాపూర్-1 డిపో కార్మికులు పిలుపునిచ్చారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి ఇమ్రాన్

తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

జాతీయ ఆరోగ్య మిషన్ చీనవీ ఆల్ క్యాదర్స్ ఉద్యోగులసమస్య లను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం డి ఇమ్రాన్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 13న నిర్వహించ నున్న సమ్మెకు సంబంధించిన నోటీసును యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్లకు ఎన్ హెచ్ఎంఉద్యోగులుఅందజేశారు ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లా డుతూ.. ఎన్ హెచ్ ఎం ఉద్యోగు లు తమకు ఎదురవుతున్న స మస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటిని తక్షణమే పరి ష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అధికారు లు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు ఉద్యోగ నా యకులు తెలిపారు.చీనవీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులసమస్యలపైప్రభుత్వం తక్షణమే స్పందించి,వారిన్యాయ మైన డిమాండ్లను పరిష్కరించా లని,ఉద్యోగుల సమస్యలు పరి ష్కారం కాకపోతే రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల13ననమ్మె ను నిర్వహిం చాల్సి వస్తుందని స్పష్టం చేశారు.చీనవీ ఉద్యోగుల కు మద్దతుగా TNGO నాయకు లు వెంకట్ రెడ్డి, ఐఎన్టి యుసి నా యకులు ఎండీ జమాల్,ప్రభుత్వ ఫార్మసీ



ఆఫీసర్స్ అసోసియేషన్ ఉద్యోగ నాయకులు కార్య క్రమానికి హాజరై తమ సంపూర్ణ మద్ద తును ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు డాక్టర్ షాహిద్ అలీ, నెహ్రూ, నర్సింహా, శ్రీనివాస్, ముర ళి,వినోద్,లావణ్య గీత,భవాని, సుమలత తదిత రులు పాల్గొ న్నారు.

పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

-చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

(సూర్యాపేట అక్టోబర్ 8 తెహెల్కా న్యూస్)

సూర్యాపేట: పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి కుటుంబంలో పోష కాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందు తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి



సకాలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, కౌన్సి లర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం భవనానికి 5 లక్షల నిధులు మంజూరు చేసిన, ఎమ్మెల్యే కుంభం



తెహెల్కా న్యూస్ వలిగొండ 4-10-2026

మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో యాదవుల అభ్యున్న తి కోసం భువనగిరి శాసనసభ్య లు కుంభం అనిల్ కుమార్ రెడ్డి యాదవ సంఘం భవన నిర్మాణా నికి.5 లక్షల నిధులు మంజూరు, చేశారని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి మామిడి సత్తి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యాదవ సంఘం బిల్డింగ్ పను లకు మోక్షం లభించిందన్నారు, కాంట్రాక్టర్ గంట మురళికి ఐదు లక్షల నిధుల చెక్కును అందజేసి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞత లు తెలిపారు,ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్,ఏఈ సందీప్ రెడ్డి,జక్కుల ముత్యాలు, జక్కుల రాజమణి జడిగే సబిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సార్ అక్రమాలపై భారీ నిరసన మార్చ్‌లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08 తెహెల్కా న్యూస్

కుత్బుల్లాపూర్ సార్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్ర మాలు, అవకతవకలకు నిరసనగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన భారీ నిరసన మార్చ్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఓటర్ల జాబి తాలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని అన్నారు. సార్ ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు, మంత్రిలు , డీసీసీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, SC, ST, NSUI, INTUC విభాగాల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు.

యువత భాగస్వామ్యంతోనే టీ రహిత భువనగిరి సాధ్యం– మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్

తెహెల్కా న్యూస్ భువనగిరి8-10-2026

టిబి ముక్త్ భారత్ అభియాన్ కోసం జోష్ టీమ్ యొక్క శుభా రంభం కార్యక్రమం యాదాద్రి– భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమా వేశ మందిరంలో ఘనంగా జరి గింది. ఈ కార్యక్రమానికి భువన గిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అధ్యక్షత వహించి,ముఖ్య వక్తగా పాల్గొన్నారు.కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, చేతులు కలపండి చేరండి,మా ట్లాడండి అనే నినాదంతో జోష్ టీమ్ ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కళాశాల యువత,ఎన్ఎస్ఎస్,ఎన్ వై కె వాలంటీర్లతో ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి టీబీపై అవగాహన కల్పించ నున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మ న్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ..టీబీ అనేది నయం చేయగలిగే వ్యాధి.దాన్ని దాచిపెట్టడం వల్లే ప్రాణాలు పోతున్నాయి.ప్రధాని మోడీ,సీఎం రేవంత్ రెడ్డి నేతృ త్వంలో ప్రభుత్వం టీబీ రోగుల కు నెలకు రూ.1000 పోషకాహా ర భత్యం,ఉచిత మందులు,ఉచి త పరీక్షలు అందిస్తోంది. భువనగిరి మున్సిపాలిటీ పరిధి లోని ప్రతి వార్డులో జోష్ టీమ్ తిరిగి, దగ్గు, జ్వరం,బరువు తగ్గ డం వంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసు పత్రికి తీసుకురావాలి. టిబి రహి త తెలంగాణ వైపు మరోఅడుగు ముందుకు వేయడంలో భువనగి రి మున్సిపాలిటీ ముందుండాలి. దీనికి మహిళా సంఘాలు, కౌన్సి లర్లు అందరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు.అనంతరం జోష్ టీమ్ కు చెంది న యువతీ యువకులకు టీబీ గుర్తింపు,నివారణ,నిక్షయ్ మిత్ర, నిక్షయ్ పోషణ యోజన పథకా లపై జిల్లా క్షయ నివారణ అధికా రి అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖఅధికారి,జిల్లా క్షయ నివారణ అధికారి,మున్సిపల్ కమిషనర్,వైద్య సిబ్బంది,జోష్ టీమ్ వాలంటీర్లు,ఆశా కార్యకర్త



లు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి,DLSA కార్యదర్శి ఎ. శ్రీదేవిచే బాలబాలికల సంరక్షణ గృహాల పరిశీలన

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్ తెహెల్కా న్యూస్



జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి ఎ. శ్రీదేవి, సైదాబాద్‌లోని 'దివ్య జ్యోతి' బాలుర సంరక్షణ గృహం 'వైదేహి' బాలికల సంరక్షణ గృహాలను సందర్శించారు. ఈ పర్యటనలో, ఎ. శ్రీదేవి పిల్లలతో ముచ్చటించి, వారి విద్య, ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి, దైనందిన అవసరాలు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. సంరక్షణ గృహాలలో కల్పించిన వసతులను పరిశీలించిన అనంతరం, పిల్లలకు సురక్షితమైన, ఆరోగ్య కరమైన వారికి అనుకూలమైన (చైల్డ్-ఫ్రెండ్లీ) వాతావరణాన్ని కల్పిం చాలని ఆమె యాజమాన్యం సిబ్బందికి సూచించారు. పిల్లల హక్కులు వారికి అందు బాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, సేవల గురించి అవగాహన కల్పించాలని కూడా ఆమె ఆదేశించారు. ప్రతి బిడ్డకూ నాణ్య మైన విద్య, సంరక్షణ భద్రత లభించేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్య కతను ఆమె నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సంరక్షణ గృహాల నిర్వాహకులు, సిబ్బంది, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రుల ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

-ఎస్ఐ తేజస్విని

నడిగూడెం, అక్టోబర్ 8 (తెహెల్కా న్యూస్)



నడిగూడెం మండల కేంద్రంతో పాటు మండ లంలో దేవినవరాత్రుల పం డుగ సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ముందస్తు పోలీసు వారి అనుమతి పొంది భక్తి భావంతో పండుగ వాతావ రణంలో ఉత్సవాలు నిర్వహిం చుకోవాలని ఎస్ఐ తేజస్విని అన్నారు. రోడ్ల పైన ప్రయా ణికులకు ప్రజలకు ఇబ్బం దులు తలెత్తకుండా మండ పాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ అవసరాల కోసం మండపాల వద్ద విద్యుత్ అధికారుల అనుమతి పొందాలని తెలిపారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు పాటలు, డీజే సౌండ్ సిస్టమ్ కు ఎటువంటి అనుమతి లేదని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని మండపాల వద్ద గొడవలు కొట్లాటలు జరిగితే పూర్తి బాధ్యత కమిటీ వారిదే అని, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఏదైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి రోజు మండపాల వద్ద కమిటీ సభ్యులు నలుగురు కు తగ్గకుండా ఉత్సవాలు అయిపోయే వరకు ఉండాలని కమిటీ సభ్యులకు ఎస్సై తేజస్విని సూచించారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం

(హైదరాబాద్ అక్టోబర్ 08, తెహెల్కా న్యూస్)



జూనియర్ ఎన్టీఆర్ అభిమా నులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం తెలంగాణ : జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐ దుర్వినియోగంపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఎన్టీఆర్ అభిమానుల ఫొటోను మార్ఫింగ్ చేసి, 'చుట్టమల్లే' పాటను డీప్ ఫేక్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారని తప్పుడు వార్తలను కొందరు వైరల్ చేశారు. ఇది ఫేక్ ఫోటో అని, ఇలా మార్ఫింగ్ చేయడం నేరమని సీపీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను ఆదేశించారు. ఎన్టీఆర్ అభిమానులు ఇలా చేశారని ఆయన ట్వీట్ చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో అన్ని స్కూళ్లకు రేపటి నుంచే దసరా సెలవులు

హైదరాబాద్ అక్టోబర్ 08, తెహెల్కా న్యూస్ (ప్రతినిధి సాగర్)

తెలుగు రాష్ట్రాల్లో అన్ని స్కూళ్లకు ఎల్లుండి నుంచే దసరా సెలవులు తెలుగు రాష్ట్రాల్లోని పాఠశాలలకు దసరా సెలవుల షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో అక్టోబర్ 10 నుండి 22 వరకు (13 రోజులు) పాఠశా లలకు సెలవులు ప్రకటించగా, అక్టోబర్ 23న పాఠశాలలు పునఃప్రారం భమవుతాయి. జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 10 నుండి 21 వరకు సెలవులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో, వారాంతపు సెలవులతో కలిపి అక్టోబర్ 10 నుండి 21 వరకు పాఠశాలలకు సెలవులు వర్తిస్తాయి, అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ ఆదేశించింది.

బిగ్‌బాస్కెట్ రైడర్ల పేఅవుట్ పెంచాలి:ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 08,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్



గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం చౌరస్తా వద్ద బిగ్ బాస్కెట్ రైడర్లు చేస్తున్న ఆందోళన కార్యక్ర మంలో సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిగ్ బాస్కెట్ రైడర్లు పలు సమస్యలు సుధీర్ రెడ్డి కి దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా బిగ్‌బాస్కెట్ రైడర్ల పేఅవుట్‌ను పాత విధానంలో కొనసాగించాలని, బిగ్‌బాస్కెట్‌లో పనిచేస్తున్న డెలివరీ రైడర్లు ప్రతిరోజూ సుమారు 14 నుంచి 16 గంటల వరకు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ,వారి శ్రమకు తగిన పారితోషికం అందడం లేదని రైడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక్కో ఆర్డర్‌కు రూ.25 వరకు పేఅవుట్ చెల్లించేవారని, ప్రస్తుతం దానిని రూ.15కు తగ్గిం చారని వారు తెలిపారు. పేఅవుట్‌ను తిరిగి పెంచాలని రైడర్లు కోరినప్పటికీ, వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకుండా సుమారు 50 మంది రైడర్ల ఐడీలను బ్లాక్ చేసినట్లు వారు పేర్కొన్నారు. డెలివరీ రైడర్లు ప్రతిరోజూ ఎండ, వర్షం, ట్రాఫిక్‌ను ఎదుర్కొంటూ గంటల తరబడి పనిచేస్తున్న నేపథ్యంలో వారి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని పేఅవుట్‌ను తగ్గించకుండా గతంలో అమలు చేసిన విధంగానే ఒక్కో ఆర్డర్‌కు కనీస బేస్ పేఅవుట్‌ను రూ.25గా కొనసాగించాలని కోరారు.అలాగే బ్లాక్ చేసిన రైడర్ల ఐడీలను వెంటనే పునరుద్ధరించి వారి సమస్యలను సంస్థ యాజమాన్యం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం సుధీర్ రెడ్డి అట్టి స్టోర్ ఇంచార్జి పాషా ని పిలిపించి రైడర్ల సమస్యలు పరిష్కారం చేయాలనీ తెలిపారు.ఇంచార్జి మాట్లా డుతూ ఇట్టి సమస్యలను పైస్థాయి వారి దృష్టికి తీసుకొనివెళ్తామని అన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రైడర్ల సమస్యలు పై స్థాయి అధికా రులతో మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చా రు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి,గండి సన్నీ యాదవ్, రమణారెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్

-డబ్బులు ఇస్తామని నమ్మించి ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి దారుణ హత్య

నాగోల్, అక్టోబర్ 08,తెహెల్కా న్యూస్ ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.



డబ్బులు ఇస్తామని మాయమాటలు చెప్పి మహిళను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు ముందస్తు పథకం ప్రకారం మృతురాలిని జైపురి కాలనీకి రప్పించి, అనంతరం 100 ఫీట్ల రోడ్డులోని ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లినట్లు వెల్లడైంది. నేరానికి దారితీ సిన పరిస్థితులు ఏ-1 పాల్వాయి యెల్లయ్య, ఏ -2 ఇరుగుల సీతారామరాజు, రామ్‌లకు మద్యం సేవిం చడం తదితర చెడు అలవాట్లు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో వారు కూలీ అడ్డాలకు వెళ్లి మహిళలను పరిచయం చేసుకుని, డబ్బులు ఇస్తామని ప్రలోభపెట్టి నాగోల్, బండ్లగూడ, మట్టుగూడ ప్రాంతాల్లోని ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లేవారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో 28-09-2026 సాయంత్రం ఏ-1,ఏ-2 కలిసి కామినేని హాస్పిటల్ చౌరస్తా వద్ద ఉన్న వైన్స్‌లో మృతు రాలు అలకుంట మంగను కలిశారు. అనంతరం ఆమెను ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లాలని పథకం రూపొందించారు.పథకం ప్రకారం 29-09-2026 ఉదయం 09:53 గంటలకు ఇద్దరు కలిసి ఏ-1 బంధువు వద్ద నుంచి రూ.5,000/- తీసుకుని, మృతురాలికి ఫోన్ చేసి జైపురి కాలనీకి రావాలని కోరారు. వారి మాటలు నమ్మిన మృతురాలు ఉదయం 10:22 గంటలకు జైపురి కాలనీకి చేరుకుని నింది తులను కలిసింది.అనంతరం నిందితులు ఆమెకు రూ.5,000/-ఇస్తామని చెప్పి, వైన్స్ నుంచి మద్యం, నీరు తదితర వస్తువులు తీసుకుని 100 ఫీట్ల రోడ్డు లోని పొదల్లోకి తీసుకెళ్లారు. అక్కడ ముగ్గురూ మద్యం సేవించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మృతురాలు తనకు డబ్బులు ఇవ్వాలని అడగడంతో నిందితులు ఆగ్రహానికి గురై ఆమెను హత్య చేయాలని పథకం వేశారు. ఏ-1 మృతురాలిని కింద పడేయగా, ఏ-2 ఆమె కదలకుండా ఉండేందుకు కాళ్లు పట్టుకు న్నాడు. అనంతరం ఏ -1 తన కాలును ఆమె గొంతుపై ఉంచి బలంగా నొక్కాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె మృతి చెందిందని భావించిన నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీడీఆర్, టవర్ లొకేషన్ ఆధారంగా అరెస్ట్ నాగోల్ పోలీసులు మృతురాలితో పాటు నిందితుల కాల్ డేటా రికార్డులు (సిడిఆర్ఎస్),మొబైల్ టవర్ లొకేషన్లను విశ్లేషించారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. మొదట ఈ కేసు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద నమోదు కాగా, నిందితుల వాంగ్మూ లాలు, సీజ్ వివరాల ఆధారంగా క్రైం నంబర్ 636/2026లో సెక్షన్ 103(1)గా మార్చారు.ఈ కేసులో ఇద్దరు నిందితులను 08-10-2026 ఉదయం 10:30 గంటలకు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలిం చారు. ఈ అరెస్ట్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్ మార్గదర్శ కత్వంలో, ఎల్‌బీనగర్ ఏసీపీ బి.రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగింది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.డి. మక్బూల్ జాని ఆధ్వర్యంలో నాగోల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డా. జోయల్ చంద్ర కుమార్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08తెహెల్కా న్యూస్



హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డా. జోయల్ చంద్ర కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ మహమ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా డా. జోయల్ చంద్ర కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు డిగా ప్రకటించారు.ఈ సందర్భంగా డా. జోయల్ చంద్ర కుమార్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో చాలామంది సామాన్య ప్రజలు తమ హక్కులపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమకు ఎదురవుతున్న సమస్యను గుర్తించ లేని పరిస్థితితో పాటు, సమస్యను ఎవరికి తెలియ జేయాలి, పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలి అనే విషయాలపై అవగాహన లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు.ప్రజల హక్కుల పరిరక్షణ, వారికి న్యాయపరమైన అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంస్థను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని డా. జోయల్ చంద్ర కుమా ర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొమ్ము ఓదెలు నూతనంగా నియామ కమైన రాష్ట్ర అధ్యక్షులు డా. జోయల్ చంద్రకుమార్ కి పుష్ప గుచ్ఛము అందచేసి శాలువాతో సత్కారించారు అనంతరం మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు గా బాధ్యతలు స్వీకరించిన 2నెలల అనుభవలను రాష్ట్ర కమిటీ తో పంచుకున్నారు. పెద్దపెల్లి జిల్లా సభ్యులు కూడా జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ జనరల్ సెక్రెటరీ సన, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమ్యశ్రీ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షు రాలు రాజ్యలక్ష్మి, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ గడ్డం సత్యనారాయణ, మీడియా సెక్రెటరీ బోయిని ప్రసాద్,జాయింట్ సెక్రెటరీ గీట్ల మధు గారు తదితరులు పాల్గొన్నారు.

ACB వలలో నిర్మల్ జిల్లా, ఖానాపూర్ రేంజ్ & డివిజన్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్తెహెల్కా న్యూస్



నిర్మల్ జిల్లా, ఖానాపూర్ రేంజ్ & డివిజన్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (AO) ఐండ్ల రవీందర్, ఫిర్యా దుదారునికి చెందిన టింబర్ డిపో లైసెన్స్ పునరు ద్ధరణ కోసం తనిఖీ నివేదికను పరిశీలించి ఉన్నతాది. కారులకు పంపే అధికారిక పనిని చేయడానికి రూ. 12,000 లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఆదిలాబాద్ రేంజ్ ACB అధికారులకు రెడ్-హ్యాం డెడ్‌గా (అడ్డంగా) పట్టుబడ్డారు.ఆరోపిత అధికారి (AO) వద్ద నుండి రూ. 12,000 లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, అక్రమ ప్రయో జనం పొందేందుకు AO తన విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు. అందు వల్ల, AOను అరెస్టు చేసి కరీంనగర్‌లోని SPE & ACB కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుఎ ర్చుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.

-సెల్ ఫోన్ నంబర్-1064 (టోల్ ఫ్రీ నంబర్):

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్ల యితే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ACB టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కూడా ACB తెలంగాణను సంప్రదిం చవచ్చు: వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), X/గతంలో ట్విట్టర్ (@Telangana ACB). ACB తెల ంగాణను సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ACB యొక్క QR కోడ్ ప్రదర్శించబడింది. బాధితుడు /ఫిర్యాదుదారుని పేరు వివరాలు గోప్యంగా ఉంచబ డతాయి. పి.ఆర్.ఓ., అవినీతి నిరోధక శాఖ (ACB), తెలంగాణ, హైదరాబాద్.

బిజినెస్

అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్ భారత్‌లోనూ ఉద్యోగాల కోత!



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి ఉద్యోగాల తొలగింపు ప్రక్రియను చేపట్టింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్, అమెరికా, యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది. రానున్న రోజుల్లో మొత్తం 30,000 మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా కోతలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. "మా ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశాం" అని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే, ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు, కరోనా మహా మ్మారి సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రస్తుత తొలగింపులకు కారణమని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అన్నారు. "ఆ సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారు. అది మాకు చాలా ఒత్తిడితో కూడిన కాలం" అని 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. భారత్‌లో 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్' సేల్, ప్రపంచవ్యాప్తంగా 'ప్రైమ్ బిగ్ డీల్ డేస్' సేల్ ప్రారంభమైన తరుణంలోనే ఈ లేఆఫ్‌లు జరగడం గమనార్హం. మంగళవారం రోజున ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం అందించారు. దీంతో ప్రభావిత ఉద్యోగులు కంపెనీ అంతర్గత స్లాక్ ఛానల్‌లో సెవరెన్స్ ప్యాకేజీ, నోటీస్ పీరియడ్, ఇతర అవకాశాలపై చర్చించుకున్నట్లు సమాచారం.

కొత్త రంగులో సుజుకి బండి.. మరింత స్పోర్టీగా, అదే ధరతో!



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా, తమ పాపులర్ అడ్వెంచర్ టూరర్ మోడల్ వీ-స్ట్రామ్ బైక్‌ను కొత్త రంగులో మార్కెట్లోకి విడుదల చేసింది. క్వార్టర్-లీటర్ సెగ్మెంట్‌లో మంచి ఆదరణ పొందిన ఈ బైక్‌కు స్పోర్టీ లుక్‌ను అందించేందుకు "గ్లాస్ స్పార్కిల్ బ్లాక్ ం మెటాలిక్ మ్యాటీ ఫైబ్రాయిన్ గ్రే" అనే సరికొత్త డ్యూయల్-టోన్ కలర్ స్కీమ్‌ను పరిచయం చేసింది. ఈ కొత్త కలర్ వేరియంట్‌పై ఆకర్షణీయమైన గ్రాఫిక్స్‌ను కూడా జోడించారు.ఈ కొత్త కలర్ ఆప్షన్ ధరలో ఎలాంటి మార్పు చేయలేదు. దీని ఎక్స్-షోరూమ్ ధర (ఢిల్లీ) రూ. 2,02,118 గానే ఉంది. ఈ కొత్త రంగుతో పాటు, వీ-స్ట్రామ్ శ్ర ఇప్పటికే ఛాంపియన్ యెల్లో నం. 2 విత్ గ్లాస్ స్పార్కిల్ బ్లాక్, పెర్ల్ గ్లేసియర్ వైట్ విత్ మెటాలిక్ మ్యాటీ స్టెల్లార్ బ్లూ, మరియు ఆల్-గ్లాస్ స్పార్కిల్ బ్లాక్ వంటి రంగులలో అందుబాటులో ఉంది. ఇంజిన్ మరియు ఫీచర్లు సుజుకీ వీ-స్ట్రామ్ శ్ర బైక్‌లో 249 సీసీ, సింగిల్-సిలిండర్, ఆయిల్-కూల్డ్ శ్రీనిజ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 9,300 తీజూఎ వద్ద 26.5 శక్తిని, 7,300 వద్ద 22.2 టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మెరుగైన పనితీరు కోసం సుజుకి ఆయిల్ కూలింగ్ సిస్టమ్ ెక్నాలజీని ఇందులో ఉపయోగించారు. అడ్వెంచర్ ప్రయాణాలకు అనువుగా ఈ బైక్‌లో 19-అంగుళాల ఫ్రంట్, 17-అంగుళాల రియర్ వీల్స్, 205 మి.మీ గ్రౌండ్ క్లియరెన్స్, డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ వంటి ఫీచర్లు ఉన్నాయి. తేలికైన ఛాసిస్, సౌకర్యవంతమైన రైడింగ్ పొజిషన్ దీని ప్రత్యేకతలు. ఆధునిక ఫీచర్లైన ఎల్ఈడీ లైటింగ్, సుజుకి ఈజీ స్టార్ట్ సిస్టమ్, సుజుకి రైడ్ కనెక్ట్ యాప్‌తో కూడిన బ్లూటూత్-ఎనేబుల్డ్ డిజిటల్ కన్సోల్, విండ్‌స్క్రీన్, నకుల్ కవర్లు, యూఎస్‌బీ ఛార్జింగ్ అవుట్‌లెట్ వంటివి రోజువారీ ప్రయాణాలతో పాటు వారాంతపు టూరింగ్‌కు కూడా దీనిని అనుకూలంగా మారుస్తున్నాయి. ప్రస్తుతం ఈ బైక్ కొనుగోలుపై కంపెనీ ప్రత్యేక ఆఫర్లను కూడా అందిస్తోంది. అర్హతను బట్టి 100 శాతం వరకు లోన్, 6.99 శాతం నుంచి ప్రారంభమయ్యే వడ్డీ రేట్లతో ఫైనాన్సింగ్ సదుపాయం కల్పిస్తోంది. దీనితో పాటు, నిబంధనలకు లోబడి రూ. 5,000 విలువైన వోచర్‌ను కూడా అందిస్తున్నట్లు సుజుకి ప్రకటించింది.

వెనుక అద్దం లేకుండా కొత్త డిజైన్.. ఆకట్టుకుంటున్న జాగ్వార్ 'టైప్ 01' కారు



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్, తమ భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా ఒక కీలక ముందడుగు వేసింది. పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ దిశగా తమ ప్రయాణాన్ని చాటుతూ 'టైప్ 01' పేరుతో సరికొత్త ఆల్-ఎలక్ట్రిక్ లగ్జరీ గ్రాండ్ టూరర్ (జీటీ) కారును న్యూయార్క్‌లో ఆవిష్కరించింది. అమెరి కాలోని సంపన్న కొనుగోలుదారులను, ముఖ్యంగా టెక్ మిలియనీర్లను లక్ష్యంగా చేసుకుని ఈ కారును మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధర 1,30,500 డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 1.08 కోట్లు)గా నిర్ణయించారు.ఈ ఫోర్-డోర్ ఎలక్ట్రిక్ జీటీ కారు డిజైన్ ఎంతో ప్రత్యేకంగా ఉంది. 1960ల నాటి క్లాసిక్ జాగ్వార్ ఈ-టైప్ మోడల్ స్ఫూర్తితో దీనిని తీర్చిదిద్దారు. చాలా పొడవైన బానెట్, వెనుక వైపు అద్దం (రియర్ విండో) లేకపోవడం దీని ప్రధాన ఆకర్షణ. అత్యాధునిక టెక్నాలజీతో పాటు, చూడటానికి నిరాడంబరంగా ఉండే రంగుల్లో దీన్ని అందిస్తున్నారు. టాటా మోటార్స్ యాజమాన్యంలోని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఈ కారును తమ సంస్థ చరిత్రలో ఒక నూతన తరానికి, పరివర్తన శకానికి నాందిగా అభివర్ణించింది.యూరప్ మార్కెట్‌లో చైనా నుంచి వస్తున్న చౌక ఈవీల పోటీ, టారిఫ్‌ల వంటి సమస్యల నేపథ్యంలో జాగ్వార్ తన దృష్టిని పూర్తిగా అమెరికా మార్కెట్‌పై కేంద్రీకరించింది. అయితే, అమెరికాలో ఈవీల పట్ల ఆసక్తి కాస్త తగ్గుముఖం పడుతున్న తరుణంలో ఇంత భారీ ధరతో కారును విడుదల చేయడం ఒక పెద్ద సాహసంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఫెరారీ, లంబోర్ఘిని వంటి ఇతర లగ్జరీ బ్రాండ్లు ఇంకా పూర్తిస్థాయి ఈవీల తయారీకి సంశయిస్తున్న వేళ జాగ్వార్ ఈ నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం సంస్థ కొన్ని సవాళ్లను ఎదుర్కొ ంటోంది. 2025లో ఎదురైన సైబర్ దాడి ప్రభావం నుంచి ఇంకా కోలుకుంటున్న ఇటీవల తమ గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 10% ఉద్యోగులను తగ్గించనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, 'టైప్ 01' కేవలం ఒక కొత్త కారు మాత్రమే కాదు, లగ్జరీ ఈవీ మార్కెట్‌లో తమ భవిష్యత్తును నిలబెట్టుకోవడానికి జాగ్వార్ చేస్తున్న ఒక వ్యూహాత్మక ప్రయోగం.

ఇప్పటికీ ఫిట్.. బరువు తగ్గకుండానే బలం పెంచిన భువనేశ్వర్ కుమార్!



టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శన తో అందరినీ ఆశ్చర్యపరిచడం తెలిసిందే. 36 ఏళ్ల వయసులోనూ స్థిరంగా 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడమే కాకుండా, ఏకంగా 28 వికెట్లు పడగొట్టి ఓ భారత బౌలర్‌గా అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. వయసు పైబడటంతో కెరీర్ ముగిసిపోయిందనుకున్న దశలో.. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు టీమిండియాలోకి పునరాగమనం చేశాడు. ఈ రేంజ్ పునరాగమనం వెనుక అతడి కఠోర శ్రమ, అసాధారణ శారీరక పరివర్తన ఉంది. ఈ మార్పు వెనుక ఉన్న రహస్యాలను అతడి పర్సనల్ ట్రైనర్ సూర్య యాదవ్ ఓ జాతీయ మీడియాకు వెల్లడిం చాడు. గత మూడేళ్లలో భువనేశ్వర్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. ఆసక్తికరమైన విషయమే మిటంటే, అతడి బరువులో పెద్దగా మార్పు రాలేదు. అప్పుడు, ఇప్పుడు కూడా భువీ బరువు సుమారు 73-74 కిలోలే. కానీ, అసలు మార్పంతా శరీరం లోని కొవ్వు, కండరాల నిష్పత్తిలోనే ఉంది. మూడేళ్ల క్రితం భువీ శరీరంలో కొవ్వు శాతం (బాడీ ఫ్యాట్) దాదాపు 20 శాతం ఉండగా, కఠోర శ్రమతో దాన్ని 13-14 శాతానికి తగ్గించుకున్నాడు. అంటే, కొవ్వును కరిగించి, ఆ స్థానంలో కండరాల బలాన్ని పెంచుకు న్నాడు. ఇది ఫాస్ట్ బౌలర్‌కు అత్యంత కీలకం. గతంలో వెన్ను, చీలమండ, మోకాలి గాయాలతో ఇబ్బందిపడిన భువనేశ్వర్‌కు బరువులు ఎత్తే శిక్షణ అంటే కాస్త భయం ఉండేది. అయితే, ట్రైనర్ సూర్య యాదవ్ అతడిని నెమ్మదిగా ప్రోగ్రెసివ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్‌కు అలవాటు చేశాడు. ఫలితంగా, ఒకప్పుడు స్క్వాట్స్‌లో కేవలం 40 కిలోల బరువును కష్టంగా ఎత్తిన భువీ, ఇప్పుడు ఏకంగా 110-120 కిలోల బరువును సునాయాసంగా ఎత్తే స్థాయికి చేరుకు న్నాడు. ఇది అతడి కాళ్లలో పెరిగిన బలానికి నిదర్శ నం. భువనేశ్వర్ శిక్షణ కేవలం జిమ్‌కే పరిమితం కాలేదు. వారంలో 5-6 రోజులు, రోజుకు 5 నుంచి 7 గంటల పాటు కఠినమైన ప్రణాళికను అనుస రించాడు. ఇందులో హెవీ స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఒలింపిక్ లిఫ్ట్స్, పేలుడు శక్తిని పెంచే ప్లయోమెట్రిక్స్, జంపింగ్ డ్రిల్స్, బౌలింగ్ ప్రాక్టీస్, గాయాల నివారణకు సంబంధించిన వ్యాయామాలు ఉండేవి. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.. ఫాస్ట్ బౌలింగ్ సమయంలో శరీరంపై పడే తీవ్రమైన ఒత్తిడిని తట్టుకునేలా శరీరాన్ని బలోపేతం చేయడమే. ముఖ్యంగా వెన్నుపై భారం తగ్గించి, తన సహజమైన స్వింగ్, బ్యాక్‌స్పిన్‌ను కాపాడుకునేలా బౌలింగ్ మెకాని క్స్‌ను మెరుగుపరిచాడు. ఈ అంకితభావం, కఠోర శ్రమ ఫలితమే ఐపీఎల్ 2026లో కనిపించింది. నిలకడైన వేగంతో, అద్భుతమైన స్వింగ్‌తో ప్రత్యర్థు లను ముప్పుతిప్పలు పెట్టి, తన కెరీర్‌కు కొత్త ఊపిరి పోసుకున్నాడు. త్వరలో జరిగే న్యూజిలాండ్ టూర్లోనూ సత్తా చాటేందుకు తహతహ లాడుతు న్నాడు. భువనేశ్వర్ పరివర్తన ఎందరో యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

టీమిండియాలో ఆడడమే నా టార్గెట్.. సన్‌రైజర్స్ యంగ్ స్టార్ ఆసక్తికర వ్యాఖ్యలు!



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆకట్టుకున్న మధ్యప్రదేశ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శివాంగ్ కుమార్.. తన తదుపరి లక్ష్యాన్ని వెల్లడించాడు. టీమిండియా తరఫున ఆడటమే తన అంతిమ లక్ష్యమని తెలిపాడు. ఐపీఎల్‌లో ఆడటం, భారత టెస్టు జట్టుకు నెట్ బౌలర్‌గా సేవలందించడం మంచి అనుభవమే అయినా.. అసలు లక్ష్యం మాత్రం భారత జట్టుకు ఎంపిక కావడమేనని చెప్పాడు.ఎడమచేతి మణికట్టు స్పిన్నర్ అయిన శివాంగ్.. ఐపీఎల్ 2026లో 13 మ్యాచ్‌లు ఆడి 9 వికెట్లు తీశాడు. ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుతో పాటు శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత టెస్టు జట్టుకు నెట్ బౌలర్‌గా ఉన్నాడు."ఐపీఎల్‌లో ఆడటం, భారత జట్టుకు నెట్ బౌలర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. కానీ ఐపీఎల్ నా అంతిమ లక్ష్యం కాదు. భారత్ తరఫున ఆడటమే నా లక్ష్యం. ఇంకా చాలా క్రికెట్ ఆడాలి. ఇది నా తొలి సీజన్ మాత్రమే. ఇప్పుడే నా ప్రయాణం మొదలైంది" అని శివాంగ్ చెప్పాడు.సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రీ-సీజన్ శిబిరంలోనే తనకు తొలి మ్యాచ్ నుంచి ఆడే అవకాశం వస్తుందని సంకేతాలు అందాయని అతడు తెలిపాడు. కోచ్‌లు తన బౌలింగ్‌పై ప్రత్యేకంగా చర్చించేవారని, విభిన్న పరిస్థితుల్లో ఎలా బౌలింగ్ చేయాలో సూచించేవారని చెప్పాడు. "నువ్వే మా వికెట్ టేకర్" అని కూడా చెప్పేవారని వెల్లడించాడు.తొలి మ్యాచ్‌లో అవకాశం రాకపోయినా రెండో మ్యాచ్ నుంచి తుది జట్టులో రెగ్యులర్‌గా చోటు దక్కిందని శివాంగ్ తెలిపాడు. ఆరంభంలో పెద్దగా రాణించకపోయినా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో కీలక వికెట్లు తీసి తన సత్తా చాటాడు.ఈ క్రమంలో సన్‌రైజర్స్ కోచ్‌ల నుంచి లభించిన ప్రోత్సాహం తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని చెప్పాడు. ప్రధాన కోచ్ డేనియల్ వెటోరి స్పిన్నర్ కావడంతో బౌలర్ మానసిక స్థితిని బాగా అర్థం చేసుకునేవారని తెలిపాడు. కొన్ని మ్యాచ్‌ల్లో పరుగులు ఇచ్చినా.. "నువ్వు బాగా బౌలింగ్ చేస్తున్నావు. మంచి బంతులకు కూడా సిక్సర్లు రావచ్చు. దాని గురించి ఎక్కువగా ఆలోచించొద్దు" అంటూ ధైర్యం చెప్పేవారని గుర్తుచేసుకున్నాడు.బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ కూడా తనను ఎప్పుడూ నిరుత్సాహపరచలేదని శివాంగ్ చెప్పాడు. "నువ్వు నీ సామర్థ్యంలో 50 శాతం మాత్రమే చూపిస్తున్నావు. ఇంకా మెరుగ్గా చేయగలవు" అని వరుణ్ చెప్పేవారని తెలిపాడు. దేశం తరఫున టెస్టులు ఆడిన ఆటగాడు అలా ప్రోత్సహించడం తనకు ఎంతో ఉత్సాహం ఇచ్చిందన్నాడు.

స్పోర్ట్స్

పంజాబ్ కింగ్స్‌కు డబుల్ షాక్ ఇద్దరు కీలక కోచ్‌లు గుడ్‌బై



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో కీలక బాధ్యతలు చేపట్టాల్సి రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరి నిష్క్రమణతో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ నేతృత్వంలోని కోచింగ్ బృందంలో పెద్ద లోటు ఏర్పడింది.జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్, బ్రిస్బేన్ హీట్ జట్లకు హెడ్ కోచ్‌గా నియమితుడు కాగా, బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇదివరకే పంజాబ్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సైరాజ్ బహుతులే భారత జట్టు కోచింగ్ సిబ్బందిలో చేరగా, ఇప్పుడు మరో ఇద్దరు కీలక సభ్యులు దూరం కావడం పంజాబ్ యాజమాన్యానికి కొత్త సవాలుగా మారింది.హోప్స్ గత రెండు సీజన్లుగా పంజాబ్ జట్టుతో కొనసాగ ుతున్నాడు. గతంలో అతడు పాంటింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ బృందంలోనూ పనిచేశాడు. బ్రాడ్ హాడిన్ 2022 నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆస్ట్రేలియాలో జరుగుతున్న షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో తమ కొత్త బాధ్యతలను నిర్వహిస్తు న్నారు.రికీ పాంటింగ్ 2025 సీజన్ కోసం పంజాబ్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. గత సీజన్ (2026)లో పంజాబ్ జట్టు అద్భుతమైన ఆరంభాన్ని అందుకుని, వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా తడబడటంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవని పంజాబ్, 2014, 2025 సీజన్లలో ఫైనల్‌కు చేరినప్పటికీ రన్నరప్‌గానే మిగిలిపోయింది.

ఫేక్ న్యూస్, ఏఐ కంటెంట్

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కంగనా రనౌత్

ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన వ్యక్తిత్వ, ప్రచార హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫోటో, గొంతును వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారని, ముఖ్యంగా తప్పుడు వార్తలు, కృత్రిమ మేధ (ూ×) సాయంతో సృష్టించిన కంటెంట్ ద్వారా తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది. జస్టిస్ వికాస్ మహాజన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కంగనా రనౌత్ తరఫున న్యాయవాది సాకేత్ సిక్రీ వాదనలు వినిపిస్తూ, ఆమె ప్రతిష్ఠను మసకబార్చే విధంగా ఉన్న పలు వెబ్ లింకులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో కొన్ని యానిమేటెడ్ వీడియోలు, మీమ్స్ రూపంలో ఉన్నాయని, అవి వ్యంగ్య ధోరణిలో ఉన్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుత దశలో వాటిని తొలగించాలని తాము ఒత్తిడి చేయడం లేదని కంగనా తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. దావాకు సంబంధించిన నోటీసులు ముందే అందడంతో, కొందరు ప్రతివాదులు ఇప్పటికే అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానానికి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కంగనా పిటిషన్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వుల దరఖాస్తుపై నోటీసులు ఇచ్చింది. పిటిషన్ నుంచి కొందరు ప్రతివాదుల పేర్లను తొలగించిన నేపథ్యంలో, సవరించిన జాబితాను దాఖలు చేయాలని కంగనా న్యాయవాదిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 2027 ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల కాలంలో ప్రముఖులు తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడం పెరిగింది. గతంలో అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, రజనీకాంత్, జాకీ ష్రాఫ్ వంటి అగ్ర నటుల విషయంలో ఢిల్లీ హైకోర్టు సానుకూల ఉత్తర్వులు ఇచ్చింది. వారి పేరు, గొంతు, సంభాషణలను అనుమతి లేకుండా వాడరాదని స్పష్టం చేసింది. ఈ క్రమంలో, తప్పుడు వార్తలు, ఏఐ-జనరేటెడ్ కంటెంట్ వంటి ఆధునిక సవాళ్లతో కంగనా దాఖలు చేసిన ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది.



పవన్ కల్యాణ్ అంటే చిన్నప్పటి నుంచి క్రేజ్: ఆనంది

తెలుగు, తమిళ చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆనంది.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చిన్నప్పటి నుంచి తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద అభిమానినని, ఆయనే తన క్రష్ అని ఆమె తన మనసులోని మాటను వెల్లడించారు.తన తాజా చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆనంది మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా, మీకు ఇష్టమైన హీరో ఎవరు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఏమాత్రం తడుముకోకుండా సమాధానమిచ్చారు. “చిన్నప్పటి నుంచి నాకు పవన్ కల్యాణ్ గారంటే ఎంతో ఇష్టం. నిజం చెప్పాలంటే చిన్నతనం నుంచే ఆయనే నా క్రష్” అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు.పవన్ కల్యాణ్ సినిమా విడుదలవుతోందంటే చాలు, తమ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని ఆమె వ్యాఖ్యానించారు. వెండితెరపై ఆయన ప్రదర్శించే విలక్షణమైన మ్యానరిజమ్స్, స్టైల్‌ను తాను ఎంతగానో ఇష్టపడతానని తెలిపారు. నటిగా చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తర్వాత కూడా పవన్‌పై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆనంది చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.



సూర్య 'సీన్' నుంచి ఫస్ట్ సింగిల్.. "అమ్మో ఇది ఎవర్రా"!





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు జిత్తు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సీన్'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చారు. గురువారం ఈ చిత్రం నుంచి "అమ్మో ఇది ఎవర్రా" అనే మొదటి పాటను విడుదల చేశారు. తమిళంలో "ఆతి ఇవ యార్రా" పేరుతో విడుదలైన ఈ పాట సినీ ప్రియులను, అభిమానులను ఆకట్టుకుంటోంది.నిర్మాణ సంస్థ ఝగరం స్టూడియోస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ పాటను పంచుకుంది. సుషిన్ శ్యామ్ స్వరపరిచిన ఈ గీతానికి తమిళంలో రాజప్రియన్ సాహిత్యం అందించి, స్వయంగా ఆలపించాడు. తెలుగులో రాకేందు మౌళి సాహిత్యం అందించగా, వినాయక్ ఆలపించాడు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులలో అంచనాలను భారీగా పెంచింది. "అతని నీచమైన స్వభావాన్ని దాచిపెట్టడానికి, అతని ప్రతిభను ప్రదర్శిస్తూనే ఉంటారు" అనే వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్, ఇన్‌బరాజ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా సూర్య పాత్రను పరిచయం చేసింది. "నేను జైల్లో పెట్టిన 900 మంది నేరగాళ్లలో నువ్వొకడివి" అంటూ సూర్య చెప్పే డైలాగ్ ఆయన పాత్ర ఎంత తీవ్రంగా ఉండబోతోందో తెలియజేసింది.గత ఏడాది డిసెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. మొదట 'సూర్య 47' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ప్రస్తావించారు. సూర్య, జిత్తు మాధవన్ కాంబినేషన్‌లో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రంలో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ నటుడు నాస్లెన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. జాన్ విజయ్, ఆనందరాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. వినీత్ ఆగస్టియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజ్మల్ సాబు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com